ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

సచివాలయాల రేషనలైజేషన్‌పై కసరత్తు

సిబ్బంది కుదింపునకు రంగం సిద్ధం • రెండు సచివాలయాలు ఒక క్లస్టర్‌గా మార్పు • ఖాళీల భర్తీ లేనట్లే?

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పూర్తిచేసి, వాటిలో పనిచేసే సిబ్బందిని కుదించడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగానే ఒక్కో క్లస్టర్‌లో రెండు సచివాలయాలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సచివాలయాలకు సంబంధించి నివేదికను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభా, రియల్ ఎస్టేట్, అపార్టుమెంట్ల ద్వారా అత్యధిక ఆదాయం పొందుతున్న కృష్ణాజిల్లా తాడిగడప మున్సిపాల్టీలోని 19 వార్డు సచివాలయాలను, బేస్ సంఖ్య ఉన్న మండలాల్లో అదనంగా ఒక గ్రామ సచివాలయాన్ని యతాథతంగా కొనసాగించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈక్రమంలోనే ప్రస్తుతం ఉన్న 508 గ్రామ వార్డు సచివాలయాలను 295 క్లస్టర్లలో సర్దుబాటు చేయడానికి అవకాశం ఉందని పేర్కొంటూ అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపింది.

జిల్లాలోని 123 వార్డు సచివాలయాల్లో 1,230 మంది, 385 గ్రామ సచివాలయాల్లో 4,235 మంది ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. వీటి ద్వారా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లోని 6 లక్షల 20 వేల కుటుంబాలకు పౌరసేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించకపోవడంతో సచివాలయ సిబ్బందే ప్రతి నెలా సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. ఈఏడాది మొదట్లో రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా విలీనం చేయడానికి జిల్లాల నుంచి కూటమి ప్రభుత్వం నివేదికలు కోరింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జిల్లా యంత్రాంగం నివేదిక సిద్ధం చేసింది.

ఖాళీల భర్తీ లేనట్లే !

జిల్లాలోని 508 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5,465 పోస్టులు ఉన్నాయి. దీనికి గానూ ప్రస్తుతం 4,878 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 587 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులపై పనిభారం పెరిగిపోయింది. తాజాగా రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మార్పు చేసి ఖాళీలను భర్తీ చేయకపోతే మరింత ఒత్తిడికి గురవుతామని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పమిడిముక్కల మండలం గోపావానిపురం, తాడంకి గ్రామాల్లో జరిగిన విజయలక్ష్మి, దుర్గ భౌతికకాయాలకు నివాళులర్పిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.కుమారి, ధనశ్రీ తదితరులు; ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న నేతలు (కింద కుడివైపు)

మృతి చెందిన ఆశాల కుటుంబాలను ఆదుకోవాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి
- పాడే మోసి నివాళులర్పించిన యూనియన్ నేతలు
- ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

వార్త మెయిన్‌లో

ప్రణాళికను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, నూతన కమిటీ నాయకులు

గాంధీ హిల్ అభివృద్ధికి ప్రణాళిక

ఫౌండేషన్ నూతన అధ్యక్ష కార్యర్శులు

కాజా, రామచంద్రరావు వెల్లడి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గాంధీ హిల్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని గాంధీహిల్ ఫౌండేషన్ నూతన కమిటీ అధ్యక్షులు డాక్టర్ గాంధీ పిసి కాజా, కార్యదర్శి వై.రామచంద్రరావు తెలిపారు. ఇకపై గాంధీహిల్ వేదికగానే ఫౌండేషన్ కార్యకలాపాలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 8న నూతనంగా ఏర్పాటైన గాంధీ హిల్ ఫౌండేషన్ సమావేశం జరిగిందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎక్స్-అఫిషియో సభ్యులుగా పాల్గొన్న ఈసమావేశంలో నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా తాము నియమితులయ్యామమని, డాక్టర్ జంధ్యాల శంకర్, డాక్టర్ రావి శారద, ఐ.ప్రసాద రాజు, రశ్మీ సమరం, డాక్టర్ జి.వి.మోహన ప్రసాద్‌లతో కమిటీ ఏర్పాటైందని తెలిపారు. ఈసమావేశంలో ఒకప్పుడు విజయవాడ నగరానికే గర్వకారణంగా ఉన్న గాంధీ పర్వతం ప్రస్తుత పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. గాంధీ హిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ అభివద్ధికి దశలవారీగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. 2025-2027 మధ్య తొలి దశలో ప్రాముఖ్యతగల కార్యక్రమాలను చేపడతామన్నారు. గాంధీ హిల్ సుందరీకరణలో భాగంగా ప్రధాన ద్వారం వద్ద ఆర్చిని అందంగా తీర్చిదిద్దుతామని,

(మిగతా 2లో)

పశుగ్రాసం, నీటి కొరత నివారణకు చర్యలు

• ఎన్ఆర్‌జిఎస్ నిధులు కేటాయింపు • నీటి తొట్లు ఏర్పాటు

• ప్రజాశక్తితో పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ఎం.హనుమంతరావు

ప్రజాశక్తి - విజయవాడ : పశు గణాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు (జెడి) డాక్టర్ ఎం.హనుమంతరావు చెప్పారు. పశుగ్రాసం, నీటి అవసరాలు తీర్చడానికీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 35 ఎకరాల్లో ఎన్ఆర్‌జిఎస్ నిధుల ద్వారా పశుగ్రాసం పెంచుతున్నామన్నారు. పాడి పశువుల సంరక్షణ, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ హనుమంతరావు తెలిపారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించిన వివరాలపై ఆయన ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : జిల్లాలో పశుగణాభివృద్ధి-పాడి పశువుల సంరక్షణ, వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి ?

పాడి పశువుల సంరక్షణా బాధ్యతలు జాగ్రత్తగా చూడాలి. ఎండదెబ్బకు పాల ఉత్పత్తి తగ్గి వివిధ వ్యాధులకు గురవుతాయి. తగినంత నీరు తీసుకోకపోతే జీర్ణకోశ, పారుడు వ్యాధులకు పాడి పశువులు గురవుతాయి. గేదెలు డీహైడ్రేషన్ గురై, పాలదిగుబడిపై తీవ్రమైన ప్రభావంపై పడుతుంది. అలాగే వేసవిలో సరైన నీటి సదుపాయం లేకపోతే సూడి గేదెలు ఒట్టిపోయే (ఈసుకుపోవడం) ప్రమాదం ఉంటుంది. మేతకు తీసుకెళ్లిన పశువులు ఉదయం 10-11 గంటలలోపే ఇళ్లకు వచ్చేలా చూసుకోవాలి. ఎండ వేడిమి కారణంగా పాడి దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎండ వేడిమి నుంచి గేదెల సంరక్షణకు పాకల చుట్టూ తడిపిన గోనె సంచులు, స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేయాలి. గేదెలకు తాగే నీరు అందుబాటులో ఉంచాలి. బి కాంప్లెక్స్ లాంటివి పచ్చి మేతతో కలిపి

(మిగతా 2లో)

నేడు కలెక్టరేట్లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి - విజయవాడ

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ఉదయం 8.30 నుండి 9 గంటల వరకు విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, రవాణా తదితర శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు కూడా కార్యక్రమాన్ని తిలకించి అవగాహన కల్పించుకోవాలని కోరారు.

ఆర్‌డిటిని కాపాడుకుందాం : జన చైతన్య వేదిక

రేపు విజయవాడలో అఖిలపక్ష సమావేశం

విజయవాడ :

జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)ను కాపాడుకోవాలనే లక్ష్యంతో అన్ని పార్టీల రాష్ట్ర నేతలతో అఖిలపక్ష సమావేశం విజయవాడ హనుమాన్ పేటలో గల దాసరి భవన్‌లో నిర్వహించనున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూలర్ డెవలప్మెంట్ ట్రస్ట్ 1969 లో అనంతపురంలో ప్రారంభమై గత 56 సంవత్సరాలుగా గ్రామీణ పేదల అభ్యున్నతి కోసం,విద్య,వైద్యం, వ్యవసాయం, గహ నిర్మాణం మహిళా అభివద్ధి, నైపుణ్యాల శిక్షణ తదితర కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అద్వితీయంగా నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్పెయిన్ కు చెందిన విసెంట్ ఫెర్రర్, ఇంగ్లాండ్ కు చెందిన అన్నే ఫెర్రర్ ఆర్‌డిటిని స్థాపించారని తెలిపారు. అనంతపురం జిల్లా అభివద్ధిలో అత్యున్నత పాత్ర పోషించారని, లక్షలాది మంది పేదల జీవితాల్లో మార్పుకు దోహదపడిందని తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో కేంద్ర ప్రభుత్వం హోమ్ మినిస్టరీ ఫారెన్ కరెన్సీ రెగ్యులేషన్ యాక్ట్ ను ఉపయోగించి ఆర్‌డిటి విదేశాల నుంచి వస్తున్న నిధులను ఆపటం లక్షలాది పేద కుటుంబాలు జీవితాల్లో వెలుగును ఆపటంగా జనచైతన్య వేదిక భావిస్తోందని తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగులను నింపుతున్న ఆర్డిటిని కాపాడుకోవడానికి మంగళవారం జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాల్సిందిగా ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ వాదులకు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి చేశారు.

నేడు విఎంసిలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 నుండి 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెదిరింపులు, ఇంటిపై దాడి ఘటనల్లో చర్యలు తీసుకోండి

సిపికి విజయవాడ మాజీ ఎంపి కేశినేని నాని లేఖ

విజయవాడ :

తనకు వచ్చిన బెదిరింపులు, తన ఇంటిపై జరిగిన దాడిపై, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడ మాజీ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు. తన భద్రత, తన ఆస్తిని లక్ష్యంగా చేసుకుని జరిగిన రెండు తీవ్రమైన ఘటనలపై స్పందించాలని సిపికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం మద్యం కుంభకోణానికి సంబంధించి ఆర్థిక విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు ఓ పార్లమెంట్ సభ్యుడి ప్రమేయం గురించి సోషల్ మీడియాలో బహిరంగంగా వెల్లడించిన కొద్దిసేపటికి మధ్యాహ్నం 12.46 గంటల సమయంలో 8008969677 అన్‌నోన్ నెంబర్ నుండి మిస్డ్ కాల్ వచ్చిందని, తాను మధ్యాహ్నం 1.55 గంటలకు తిరిగి కాల్ చేశానని, ఆ కాలర్ తనను చక్రవర్తి కడియాలగా పరిచయం చేసుకుని, అసభ్యకరమైన, బెదిరింపు ధోరణిలో తనను దూషించాడని సిపికి రాసిన లేఖలో నాని పేర్కొన్నారు. ఇడికి పంపిన ఫిర్యాదు నుండి తన పేరు, ఎంపీ పేరును ఉపసంహరించుకోకపోతే తనను చంపేస్తానని స్పష్టంగా హెచ్చరించాడని పేర్కొన్నారు. ఇది అత్యంత తీవ్రమైన క్రిమినల్ బెదిరింపు అని, దీనిని తేలిగ్గా తీసుకోవద్దని కోరారు. అలాగే ఈనెల 8వ తేదీ రాత్రి సుమారు 9.56 గంటలకు ఓ గర్తు తెలియని వ్యక్తి కేశినేని నిలయం (ప్రధాన గేట్ ఎదురుగా) తూర్పు వైపు ఒక వాహనం నుండి దిగాడని, అతను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన ఇనుప రోడ్డు డివైడర్ బారియర్‌లను బలవంతంగా తొలగించి, రోడ్డుపై విసిరి, తన ఇంటి ప్రాంగణంలోని నీటి పాండ్ సమీపంలోని మొక్కలను ధ్వంసం చేశాడని లేఖలో పేర్కొన్నారు. తన సెక్యూరిటీ గార్డ్‌ను కూడా బెదిరించి, అక్కడి నుండి పారిపోయాడని వివరించారు. మసక వెలుతురు కారణంగా వాహనం నంబర్ ప్లేట్‌ను గుర్తించలేకపోయినా మొత్తం ఘటన సిసిటివిలో రికార్డయిందని, తన ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ శ్రావణ్ వెంటనే పటమట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారని, ఎస్‌ఐ కిరణ్ కుమార్ ప్రాథమిక తనిఖీ కోసం స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. ఈ ఘటనలు తాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు అనుసరించిన చట్టబద్ధమైన ఫిర్యాదును ఆపడానికి, తనను భయపెట్టడానికి చేసిన స్పష్టమైన ప్రయత్నాలని పేర్కొన్నారు. ఈ బెదిరింపులను చట్టపరమైన ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి, తన జీవితం, ఆస్తిని ప్రమాదంలో పడేసే సమన్వయ, దురుద్దేశపూరిత ప్రయత్నంగా తాను భావిస్తున్నానని సిపికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అందువల్ల తక్షణం ఐపిసి సెక్షన్లు 506 (బిఎన్‌ఎస్ 351)(క్రిమినల్ బెదిరింపు), 507 (అనామక బెదిరింపు) (బిఎన్‌ఎస్ 351(4), 120 బి (క్రిమినల్ కుట్ర) (బిఎన్‌ఎస్ 61(2), మరియు 427 (ఆస్తి నష్టం) (బిఎన్‌ఎస్ 324(4)తో సహా సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని కోరారు. చక్రవర్తి కడియాలను విచారించి అతని కాల్ రికార్డులు, ఉద్దేశాలు, సంభావ్య సహకారులపై పూర్తి దర్యాప్తు చేయాలని సిపికి విజ్ఞప్తి చేశారు.

ఇంటి ఆవరణలో ధ్వంసమైన పూలమొక్కలు

సృష్టిలో అపురూపమైనది అమ్మ ప్రేమ

చిత్రాల ద్వారా ఔన్నత్యాన్ని చాటిన చిన్నారులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సజనాత్మక శక్తిని వెలికి తీసి వారికి అమ్మ అనే పదానికి ఉన్న ఔన్నత్యాన్ని తెలియపర్చాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నగరానికి చెందిన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ మాత దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి నగర్ చంద్ర రాజేశ్వరరావు వీధిలో గల శిఖర స్కూల్ ప్రాంగణంలో చిన్నారులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కాంటెస్ట్ నిర్వహించారు. వంద మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా ఈ కాంటెస్ట్‌లో పాల్గొని సష్టిలో అమ్మ ప్రేమ ఎంత మధురమైనదో వారి చిత్రాల ద్వారా తెలియపర్చారు. ఈ కాంటెస్ట్‌కు ప్రముఖ పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ "క్వీన్ ఆఫ్ క్రాఫ్ట్స్" మేడా రజని న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో మనీషా డెంటల్ కేర్ సర్జన్ డాక్టర్ కే.లక్ష్మీ సమీర ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సమీర మాట్లాడుతూ పిల్లలను ఫోన్‌లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలంటే ఏదో ఒక యాక్టివిటీలో శిక్షణ ఇప్పించాలని అన్నారు. అలాగే మానవతా విలువలను పెంచే ఇలాంటి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కాంటెస్ట్‌లు వారిలో సజనాత్మకతకు మెరుగులు అద్దుతాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ స్ఫూర్తి శ్రీనివాస్ పర్యవేక్షించగా, యువ చిత్రకారులు గోపీ మనోజ్, హేమంత్ కుమార్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి - వన్‌టౌన్

వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్ రోడ్ ద్వారం వద్ద ఉన్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం నుండి 'ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ' కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు. ఘాట్ రోడ్, అమ్మవారి గుడి, కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్

శ్రీ దుర్గామల్లేశ్వరుల సన్నిధిలో అన్న ప్రసాదం వితరణ నిమిత్తం విజయవాడ నగరం గాయత్రి నగర్‌కు చెందిన ఆలపాటి పార్థసారథి ఆదివారం లక్ష రూపాయలు విరాళంగా అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. విరాళం అందించిన ఆలపాటికి, ఆయన కుటుంబ సభ్యులకు దుర్గమ్మ దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలు అందించినట్లు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

గాంధీ హిల్ అభివృద్ధికి ప్రణాళిక

లాండ్ స్కేపింగ్, ప్రధాన ద్వారం నుండి స్తూపం వరకు ఉన్న అప్రోచ్ రోడ్డును, పిల్లల పార్క్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పార్క్ పరిసర ప్రాంతాన్ని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అత్యాధునిక ట్రైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే జర్మనీ టెక్నాలజీతో విఎంసి వారు నూతనంగా ఏర్పాటు చేసిన ప్లానిటోరియం యువతను, పెద్దలను ఆకర్షిస్తోందన్నారు. ఈ ఏడాదిలో గాంధీ జయంతి నాటికి కొంత మార్పులు చేసి గాంధీహిల్‌పై జయంతి వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. విఎంసి తదితర స్థానిక ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ప్రజలతో ఎంఒయులు కుదుర్చుకుంటామని తెలిపారు. సంస్థ బైలాస్ ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి గాంధీ పర్వత సంస్థకు చీఫ్ పాట్రన్‌గా ఉంటారని తెలిపారు. సిఎం సూచనలు, సలహాల మేరకు గాంధీ హిల్‌ను స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా అభివద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా1968-69లో విజయవాడలో గాంధీ హిల్‌కు ప్రారంభోత్సవం జరిగిందన్నారు. 1968 అక్టోబర్ 6న గాంధీ స్థూపాన్ని అప్పటి రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించారని, తదుపరి 1977లో గాంధీ హిల్ ఫౌండేషన్ ఏర్పాటైందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం 2017లో గాంధీ హిల్ వద్ద నూతనంగా ఎపి గాంధీ స్మారక నిధి పేరుతో రిజిస్టరై, నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

పశుగ్రాసం, నీటి కొరత నివారణకు చర్యలు

గేదెలకు ఇవ్వాలి.

ప్రశ్న : జిల్లాలో పశు గణన ప్రకారం ఎన్ని పశువులు ఉన్నాయి?

లైవ్‌స్టాక్ సెన్సెస్ ప్రకారం 2 లక్షల 35 వేల 52 గేదెలు, 28,397 ఆవులు, 2 లక్షల 34 వేల 933 గొర్రెలు, 91,979 మేకలు, 6 లక్షల 55 వేల 856 నాటు కోళ్లు, 32 లక్షల మేర బాయిలర్, ఫౌల్ట్రీ కోళు ఉన్నాయి.

ప్రశ్న : వేసవిలో మేతకెళ్లిన సమయంలో గేదెలకు నీటి సదుపాయం ఎలా ఏర్పాటు చేస్తున్నారు ?

మేతకెళ్లిన గేదెలకు తాగడానికి అందుబాటులో నీరు ఉంచేందుకు నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ఎన్‌టిఆర్ జిల్లాలో 48 నీటి తొట్లు ఉండగా, మరో 276 నీటితొట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి రూ.33 వేల వరకు ఖర్చవుతుంది. ఈ నిధులు ఉపాధి హామీ చట్టం కింద కేటాయింపు జరుగుతున్నాయి. 17 మండలాల పరిధిలో పశుగణాభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే ఉన్నాం.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని గోశాలలు ఉన్నాయి?

జిల్లాలో తొమ్మిది గోశాలలున్నాయి. ఒక్కో గోశాలలో 200 నుంచి 500 వరకు గోవులుంటాయి. పంచాయతీరాజ్, డ్వామా పీడీ గ్రామాల్లో రైతుల భూములను పరిశీలించి, ప్రాజెక్టు రిపోర్టు తయారు చేస్తున్నారు. ఈ రిపోర్టు అందిన తర్వాత పశుగ్రాసం అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటాము.

నిబద్ధత గల నాయకుడు శ్రీనివాస్

విజయవాడ : ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి ఉయ్యాలా శ్రీనివాస్ 4 వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇస్లాంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఎంసిపిఐ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె.ఖాదర్ బాషా, బహుజన దళిత చైతన్య సంఘ నాయకులు రాచపూడి బాబురావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ ఉయ్యాలా శ్రీనివాస్ నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాలతోపాటు విజయవాడలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కషి చేశారని చెప్పారు. లాల్ నీల్ ఐక్యత కోసం కషి చేసి బహుజనులు రాజ్యాధికారం కోసం పాటుపడ్డారని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుభాని, అజాజ్, వాహేద్ పాల్గొన్నారు.

మోసపూరిత ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండండి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మచిలీ పట్నం డిఎస్పి రాజా పేర్కొన్నారు. మచిలీపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మచిలీ పట్నం సబ్ డివిజన్ పరిధిలో గడిచిన పది రోజులు కాలంగా సైబర్ నేరగాళ్ల తాము సిబిఐ, కస్టమ్స్, నార్కోటిక్స్, స్పెషల్ సెల్ మొదలైన ప్రభుత్వ సంస్థలకు చెందిన అధికారులమని ఫోన్ చేసి మీపై కేసు నమోదు అయిందని వీడియో కాల్స్ లో భయభ్రాంతులకు గురి చేయడం వంటి సైబర్ నేరానికి పాల్పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు.. ఈ నేరాలన్నీ ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చెందిన సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేసి మీరు అరెస్ట్‌లో ఉన్నారు కేసు నమోదు అయిందని భయపెట్టి, బెదిరించి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఇలాంటి డిజిటల్ అరెస్ట్ కాల్స్ ని నమ్మవద్దని, డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలోనే లేదని, అది కేవలం సైబర్ నేరగాళ్ల మోసపూరితమైన చర్య అన్నారు. . ఇలా ఎవరైనా మీకు ఫోన్ చేసి బెది రిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లేదా యాంటీ సైబర్ క్రైమ్ 1930కి కాల్ చేయాలన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి

వీర జవానులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : ఆపరేషన్ సింధూర్‌తో పహల్గాం బాధితు లకు న్యాయం జరిగిందని పలువురు మహిళలు అన్నారు. ఆదివారం గన్నవరం విశ్వ గేటెడ్ కమ్యూనిటీ రెసిడెన్సి ఆధ్వర్యంలో భారత్ పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన ఇద్దరు వీర జవానుల చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పహల్గాం దాడికి ప్రతీకారం భారతదేశం సింధూర్ ఆపరేషన్‌తో పాకిస్తాన్‌ను మట్టి కరిపించిందని తెలిపారు. పాకిస్తాన్ భారతదేశంలో ఉగ్రవాద చర్యలు చేపడితే భారతదేశం గుణపాఠం చెప్తుందని ఇదొక హెచ్చరిక అని తెలిపారు. కాశ్మీర్ అంతర్జాతీయ సరిహద్దు రేఖలలో కాల్పులకు తెగ బడిన పాక్ సైనికులను భారత ఆర్మీ తిప్పికొడుతున్న తరుణంలో రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ వివిఎస్-ఎస్ రాజు, డేగల చిన్న, పుల్లయ్య, గోపీనాథ్ , కేఆర్ దుర్గారావు, గోపి రావు, విశ్వ కమ్యూనిటీ రెసిడెన్సి సభ్యులు పాల్గొన్నారు

మురళీ నాయక్ సేవలు చిరస్మరణీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళీ నాయిక్ అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధంలో సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. సరిహద్దుల్లో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు రాము తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సచివాలయాల్లో కంప్యూటర్ల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీ పట్నం నగర పరిధిలోని 50 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు పనిచేయకపోవడం వల్ల నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో సచివాలయ సిబ్బంది వారికి వచ్చిన జీతం లోనే సొంత కంప్యూటర్ ఏర్పాటు చేసుకుని సచివాలయాన్ని కొనసాగించటం అత్యంత బాధాకరమని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అన్ని సచివాలయాల్లో తక్షణమే కంప్యూటర్లు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని నూతన కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు.అదే విధంగా సచివాలయంలో దినసరి కార్యక్రమాలకు కావలసిన వైట్ పేపర్లు ఇతర స్టేషనరీ కూడా అందజేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారులు దష్టి సారించి సమస్యను పరిష్కారం చేయాలని లంకిశెట్టి బాలాజీ కోరారు.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఉయ్యూరులో కరపత్రాలు చూపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఈనెల 20 సార్వత్రిక సమ్మెను జయప్రదం చెయ్యాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉయ్యూరు శ్రామిక భవనంలో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం ఉయ్యూరు మండల కార్యదర్శి ఆకవరపు తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్, కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి సువర్ణ రాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకష్ణ, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రంగమ్మ, కష్ణకుమారి, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సిహెచ్ సుబ్రహ్మణ్యం, ఎఫ్ఏ సంఘం రవి మహిళా సంఘం ఐద్వా నాయకురాలు బి కీర్తి పాల్గొన్నారు. **ప్రజాశక్తి- చల్లపల్లి (ఘంటసాల) :** మే 20వ తారీకు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు బాపనయ్య భవన్ సిఐటియు ఆఫీసులో మహమ్మద్ కరీముల్లా అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మెకు సంఘీభావంగా మే 17వ తారీఖున చల్లపల్లి ఘంటసాల మండలాలలో నిర్వహించే బైక్ ర్యాలీలో అన్ని ప్రజాసంఘాల నుంచి కార్మిక వర్గాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి చంద్రపాల్, రైతు సంఘం జిల్లా నాయకులు యద్దనపూడి మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బండారు కోటేశ్వరరావు, రైతు సంఘం మండల నాయకులు బొందలపాటి వెంకటేశ్వరరావు, జి. సాంబశివరావు, అంగన్వాడి, మిడ్ డే మిల్ కార్మికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మొవ్వ :** ఈనెల 20వ తారీకున జరిగే దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను ప్రజాసంఘాలు పంపిణీ చేశారు. మొవ్వ మండల సిఐటియు కార్యదర్శి కాకి రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొడాలి కరుణాకరావు, పంచాయతీ జిల్లా కార్మిక నాయకులు కొడాలి శ్రీనివాసరావు, సిఐటియు మండల నాయకులు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

అంకాలమ్మ జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామంలో వేంచేసి ఉన్న అంకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు గత రెండు రోజుల నుండి ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలను, పాల పొంగళ్లను సమర్పించి మొక్కుబడులను భక్తులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన రజకులంతా కూడా వారి స్వస్థలాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా దేవాలయం చుట్టూ రంగురంగు విద్యుత్ దీపాలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- నాగాయలంక : స్థానిక మారుతీ స్కూల్‌లో నాగాయలంక మండ లంలో అన్నీ ప్రభుత్వ ప్రవేట్ స్కూల్‌లలో పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులను సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరిం చారు. విద్యార్థులు భోగాది గాయత్రి (581) తలగడ దివి, పుషడుపు మనస్వి(550) బావదేవరపల్లి, యలవర్తి మహాలక్ష్మి(492) ఎదురు మొండి, వల్లభని బాలాజీ (488) ఏటిమోగ, భావిరెడ్డి సుస్మిత(546) చెరుకూరి సంజయ్(583)లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండవ బాలవర్ధి, రెడ్ క్రాస్ నాగాయలంక మండల అధ్యక్షులు భోగాది శివ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమం జరుగుతుందని ఇన్చార్జి కలెక్టర్ వివరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ముస్లిం పేటకు చెందిన వాచ్ మెకానిక్ అన్వర్ శనివారం రాత్రి కోనాయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీ సులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఆర్థిక ఇబ్బందులే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన అన్వర్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి వెతుకులాడగా చెరువు వద్ద అతని చెప్పులు సైకిల్ ఉండడంతో అనుమానం వచ్చి వెతుకులాడారు. గజ ఈతగాళ్లు చెరువులో దిగి అతని మతదేహాన్ని బయటకు తీశారు. అతని మతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు పోలీసులు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విజయలక్ష్మి మృతికి నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : ఘంటసాల కరణంగా ప్రజలకు సుపరిచితులైన ఘంటసాల రాధాకృష్ణమూర్తి సతీమణి, చల్లపల్లి ఆర్ఐ ఘంటసాల కృష్ణమెహన్ మాతృమూర్తి ఘంటసాల విజయలక్ష్మి (84) ఆదివారం ఉదయం స్వగృహం వద్ద మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పంచకర్ల రంగారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యద్దనపూడి మధు, ఘంటసాల మండల సీనియర్ నాయకులు వాకారామచంద్ర రావు, భలే రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, కుంపటి బాబురావులు విజయలక్ష్మి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ జరిగింది. 1987-88 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు విజయవాడలో సమ్మేళనం నిర్వహించి కుటుంబ సభ్యులతో పాటు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన నాటి విద్యార్థిని విద్యార్థులు తమ వయస్సునే కాకుండా తమ స్థితిగతులను సైతం లెక్కచేయకుండా ఎంతో ఆనందంగా గడిపారు. వారంతా ఆనాటి సంగతులను సంఘటనలను ముచ్చటించుకొని ప్రస్తుతం తమ విషయాలను ఒకరికి ఒకరు పంచుకుంటూ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యాన్ని, సంగీత కచేరి నిర్వహించుకుని సన్మానాలు చేసుకున్నారు.

గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలు

విజయవాడ : చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్యనారాయణపురంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి.సంపత్ కుమార్ చిన్నారులకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి ఒక తల్లి మన ముందు నడుస్తూ ఒక ఆదర్శాన్ని చూపిస్తుందన్నారు. తల్లి ఒక దిక్సూచిగా ఉంటుందన్నారు. తల్లి ప్రేమ వెలకట్టలేనిదన్నారు. మాతృ దినోత్సవ ప్రాముఖ్యత గురించి అనేక విషయాలు వివరించారు. అనంతరం రైల్వే రిటైర్డ్ చీఫ్ ఆఫీస్ సూపరిండెంట్ కె.శేష బాల భగవద్గీత శ్లోకాలు, ప్రభాస్ కాలేజ్ లెక్చరర్ ఇ.వి ప్రేమ్ కుమార్ జనరల్ నాలెడ్జ్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వి.సాయి సుబ్బన్న మ్యాథమెటిక్స్, రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి తెలుగు బోధించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎం.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ సమయపాలన-విలువ, వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. మైండ్ మ్యాపింగ్ అనేది ఆలోచనలు, సమాచారాన్ని నిర్వహించడానికి ఉపయోగించే దృశ్య గమనికను, తీసుకోవడానికి, మేధోమథనం చేసే సాంకేతికత అన్నారు. మైండ్ మ్యాపింగ్ ద్వారా మనం పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించగలమని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం విద్యార్థి దశ నుండే పిల్లలు నేర్చుకోవాలని దాని వల్ల అనేక లాభాలు ఉన్నాయని, నేటి బాలలు రేపటి పౌరులని అన్నారు. అనంతరం చిన్నారులచే ధ్యానం చేయించారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత పెరిగి జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, వాలంటీర్స్, పాఠకులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఒక విషయం గురించి ఎప్పటికప్పుడు వారానికి ఒకసారి, నెలకు ఒకసారి పేపర్‌పై రాస్తూ ఉంటే బాగా గుర్తుంటుందన్నారు. ప్రతి చిన్నారి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతి పాఠకులకు రివిజన్ ముఖ్యమన్నారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ వందన సమర్పణ చేశారు.

కంచికచర్ల : కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. విద్యార్థులచే పుస్తక పఠనము చేయించారు. కథలు చెప్పించడం, డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించడం చేశారు. క్రాఫ్ట్ మాస్టర్ కనకారావు కలర్ పేపర్స్ కటింగ్ నేర్పించారు. అనంతరం విద్యార్థులకు చదరంగం నేర్పారు. బ్యాడ్మింటన్, రింగ్ ఆట ఆడించారు. ఈ కార్యక్రమం గ్రంథాల అధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

విజయవాడ చిత్తరంజన్ గ్రంథాలయంలో హాజరైన విద్యార్థులు

కంచికచర్ల గ్రంథాలయంలో డ్రాయింగ్ వేస్తున్న చిన్నారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైలవరం : ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మైలవరంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం మైలవరం హాజీపేటకు చెందిన పర్చూరు శ్రీమన్నారాయణ (62) గేదెలను మేపుకొని ద్విచక్ర వాహనంపై విజవాడ బైపాస్ రోడ్ గ్యాస్ కంపెనీ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఎ.కొండూరు మండలం చీమలపాడు నుండి నుండి కూరగాయల లోడుతో విజయవాడ వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శ్రీమన్నారాయణ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

ప్రమాదానికి గురైన కారు

లారీ, కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మైలవరం : లారీ - కారు ఢీకొనడంతో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మైలవరం మండలం పుల్లూరు జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం విజయవాడ మొగల్రాజపురానికి చెందిన గోగినేని ఉమామహేశ్వరరావు సొంత పనుల నిమిత్తం కారులో తెలంగాణ రాష్ట్రంలోని పాల్వంచ వెళ్ళాడు. పనులు ముగించుకొని విజయవాడ వస్తుండగా పుల్లూరు జాతీయ రహదారి వద్ద ఇబ్రహీంపట్నం నుండి తిరువూరు వెళ్తున్న యాష్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. డ్రైవింగ్ చేస్తున్న ఉమామహేశ్వరరావు, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అవటంతో పెద్ద ప్రమాదం జరగలేదని స్థానికులు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని స్వల్ప గాయాలైన వారిని మైలవరం తరలించారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ద్వారకా తిరుమల వెంకన్న స్వామికి పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చిన్న తిరుపతిగా పేరొందిన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుండి ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ వి.కె.శీనానాయక్ దంపతులు, వేద పండితులు ఆదివారం సాయంత్రం స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యనిర్వాహణాధికారి దంపతులను ద్వారకా తిరుమల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్.వి.ఎస్.ఎన్.మూర్తి స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గా ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు తిరువూరులో గ్రీవెన్స్ : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు డివిజన్‌లోని మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం తిరువూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రజల నుండి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి అర్జీల స్వీకరణ ప్రారంభమవుతుందన్నారు. తిరువూరు డివిజన్‌తో పాటు మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా తిరువూరులో అర్జీలు సమర్పించొచ్చన్నారు.

వీర జవాన్ మురళీ నాయక్‌కి నివాళులు

ప్రజాశక్తి - భవానీ పురం : పశ్చిమ నియోజక వర్గంలోని శివాలయం సెంటర్‌లో టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆపరేషన్ సిందూర్ ప్రక్రియలో చనిపోయిన వీర జవాన్ మురళి నాయక్‌కి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా భవానిపురం సిఐ ఉమామహేశ్వరరావు, టీడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం ఎస్ బెగ్ పాల్గొన్నారు. సిఐ ఉమామహేశ్వరరావు మురళి నాయక్ కి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పత్తి నాగేశ్వరరావు, సారేపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పాసైన విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలో 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణతలో ప్రథమ స్థానంలో నిలిచిన గౌరవరం గ్రామానికి చెందిన విద్యార్థి నెట్టెం మురళి వెంకట సాయి 578 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పట్టణంలోని స్థానిక ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో ఎంఎల్ఎ రాజగోపాల్ శాలువాతో సత్కరించారు. మండలంలోని గౌరవరం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పట్టా నరసరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు మురళీ వెంకట సాయిని సాల్వతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసల రమేష్ బాబు, దుగ్గిరాల మహేష్ బాబు, బుజ్జి బాబు, ప్రధాన కార్యదర్శి కొప్పుల రాము, బాజినేడి ధనమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : ఈ ప్రపంచంలో మరువలేనిది మాతృమూర్తి మమకారమని డిప్యూటీ కమిషనర్ జీవీకే సరిత సూచించారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్క రాములు కోటేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాత జనరల్ ఆసుపత్రిలో డిసిపి తల్లికి చీర నవజాత శిశువుకు బెడ్ షీట్, పండ్లు పంపిణీ చేసి ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి త్యాగాన్ని ప్రతిఇక్కరు గుర్తించుకోవలసిన అవసరం ఉందన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు చూపించే ప్రేమ తత్వం చాలా విలువైనదని అందుకు అనుగుణంగా పిల్లలు వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నక్క రాజ్యలక్ష్మీ, జడగం భాస్కర్, మూలి సాంబశివరావు, గుర్రం జమలయ్య, కె.వెంకటేశ్వరరావు, గజ్జల శ్రీనివాస, వెంకటేశ్వరమ్మ చంద్రిక, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కేతనకొండ గ్రేస్ చర్చ్ మినిస్ట్రీస్‌లో మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ మొగులూరు ఎలీషా మాట్లాడుతూ ఈ భూమి మీద ప్రేమకు అతి గొప్ప నిదర్శనం తల్లి ప్రేమ అన్నారు. అమ్మ తన పిల్లలు ఈ ప్రపంచంలోకి రాకముందే గర్భంలో ఉన్నప్పటి నుండే ప్రేమిస్తుందని, పిల్లల నుండి ఏది ఆశించకుండా ప్రేమిస్తుందని, పిల్లల అవసరాలు అర్థం చేసుకుంటుందని, అమ్మ జీవితం అంతా ప్రేమకి, త్యాగానికి నిదర్శనం అన్నారు. ఈ లోకంలో ప్రతి ఒక్కరి తొలి గురువు తల్లి అని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తల్లులను శాలువాలతో సన్మానించి, వారికి బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సుమలత, పెద్దలు అబ్రహం, మాణిక్యరావు, యోబు, హరీష్, ప్రభుదాసు, అనిల్ మరియు సంఘస్తులు పాల్గొన్నారు.తల్లిదండ్రులను భారంగా భావిస్తోన్న ఈ రోజుల్లో మాతృ దినోత్సవం సందర్భంగా ఫెర్రీలోని ఓ కుటుంబం తమ తల్లిదండ్రులకు దేవాలయాన్ని నిర్మించి ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఫెర్రీలోని తోట వెంకటనారాయణ, వెంకట సుబ్బమ్మ 12 మంది కుమారులు, కుమార్తె అందరూ కలిసి మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ తల్లిదండ్రుల విగ్రహాలను తమ నివాసం ఎదుటే బంధుమిత్రుల సమక్షంలో పండగ వాతావరణంలో ప్రతిష్టించుకున్నారు. అనంతనం భోజన ఏర్పాట్లు చేశారు. **జగ్గయ్యపేట :** అంతర్జాతీయ మదర్స్ డే సందర్భంగా కెఎస్‌ఆర్ అప్పారావు ఇంటి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

విజయవాడలో ఆస్పత్రిలో తల్లికి చీర, బిడ్డకు పండ్లు పంపిణీ చేస్తున్న డిసిపి సరిత

ఇబ్రహీంపట్నంలో వేడుకలు...

మాతృమూర్తులకు ప్రేమవిందు

రెడ్డిగూడెం : మాతృదినోత్సవం సందర్భంగా 'ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ' స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల ఆధ్వర్యంలో మాతృమూర్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు తమతమ అభిప్రాయాలను, తమ జీవన విధానాలను ఒకరికొకరు పంచుకున్నారు. కుటుంబ వ్యవస్థలో తల్లులకు ఓర్పు చాలా అవసరం అని వారు తెలిపారు.

పోరాట యోధుడు చల్లపల్లి నారాయణరావు

- జైలు జీవితమే మూలమలుపు
- ప్రాణాలను సైతం లెక్క చేయని గుండె ధైర్యం
- నేడు 75వ వర్థంతి

కృష్ణాజిల్లా దివి తాలూకాలో చల్లపల్లి జమీందారుకి 77 గ్రామాలలో 17540 ఎకరాల భూమి ఉండేది. ఆయనను ఎదిరించి చల్లపల్లి జమీందారుని కూల్చడానికి దున్నేవానికి భూమి కోసం సాగిన చారిత్రాత్మక పోరాటంలో ప్రాణ బలిదానం చేసిన 44 మందిలో చల్లపల్లి నారాయణరావు ఒకరు.

చల్లపల్లి నారాయణరావును కాల్చి చంపి నేటికీ 75 సంవత్సరాల అయింది. చల్లపల్లి నారాయణరావు సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముగ్గురు సోదరులలో ద్వితీయుడు. 1928లో ఇంటర్ చదవడానికి గుంటూరు ఏసీ కాలేజీలో చేరారు. 1930-32 మధ్య చదువుకునే రోజులలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనేందుకు చదువుకు స్వస్తి చెప్పారు. ఈ సత్యాగ్రహ ఉద్యమం నారాయణరావుకి దేశభక్తిని జాతీయ అభిమానాన్ని తీసుకొచ్చింది. తన అన్న వెంకట రామదాసును స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనాలని కోరి ఉత్సాహపరిచారు. వెంకట రామదాసు కరణీకానికి స్వస్తి చెప్పి గుంటూరు వెళ్లి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని నరసరావుపేటలో అరెస్టయ్యారు. అనంతరం వారిరువురికి రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించి తిరుచునాపల్లి జైలుకు తరలించారు. తరువాత బళ్లారి జైల్లో కూడా శిక్ష అనుభవించారు. గాంధీ ఇర్విన్ ఒప్పంద కారణంగా ఇరువురు విడుదలయ్యారు.

చల్లపల్లి జీవితంలో అదే మూల మలుపు

చల్లపల్లి నారాయణరావు జైల్లో ఉండగా, పుచ్చలపల్లి సుందరయ్య, పోలిపెద్ది నరసింహామూర్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయమే ఆయనను కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షించబడ్డారు. నారాయణరావు మొదట కాంగ్రెస్ లోనూ, కాంగ్రెస్ సోషల్ పార్టీలోనూ సభ్యుడిగా చేరి 1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. 1937లో జమీందారు వ్యతిరేక పోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. దివి తాలూకాలో జమీందారు వ్యతిరేక పోరాటంలోకి రైతాంగాన్ని సమీకరించారు. చలసాని వాసుదేవరావు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి నాయకత్వంలో జరిగిన 136 రోజుల రైతు రక్షణ యాత్రలో పాల్గొన్నారు. దివి తాలూకాలో కామినేని వెంకటప్పయ్య, గొర్రెపాటి వెంకటప్పయ్య, కలసాని వాసుదేవరావు, వల్లభనేని కాశీ విశ్వనాథం, చండ్ర రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్య, జగన్నాధ రావుతో కలిసి నారాయణరావు జమీందారుకు వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించడంలో ముందున్నారు. రైతు సంఘం కార్యాలయం పెట్టుకునేందుకు జమీందారుకు భయపడి ఎవరు స్థలం ఇవ్వలేదు. నారాయణరావు అన్న వెంకట రామదాసు తన ఇంటిలో రైతు సంఘం కార్యాలయం నెలకొల్పారు. అన్న వెంకట రామదాసు జైలు నుండి వచ్చి మళ్లీ కరుణికంలో పనిచేస్తున్నప్పటికీ తన ఉద్యోగానికి ముప్పు వచ్చే పరిస్థితి ఏర్పడినప్పుడు వెనుతిరగలేదు. చల్లపల్లి జమీందారు హైస్కూలులో నారాయణరావు విద్యార్థి సంఘాన్ని నెలకొల్పారు. పూర్వ విద్యార్థి సంఘం ఏర్పాటు చేసి ఏటా పెద్ద ఎత్తున ఆటల పోటీలు, వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో రాజకీయ చైతన్యాన్ని కల్పించారు. 1942లో జమీందారు మంగళాపురంలో ముదిరాజుల (పేదరైతుల) భూముల నుండి బయటకు వెళ్లగొట్టి భూములు అమ్ముకునే ప్రయత్నం చేశారు. చల్లపల్లి నారాయణరావు, చండ్ర రాజేశ్వరరావు, గుంటూరు బాపనయ్యలు పేద రైతాంగానికి అండగా నిలిచి తీవ్ర పోరాటం చేశారు ఆ పోరాటంలో పై ముగ్గురు నాయకులను జమీందారు గుర్రాలతో తొక్కించి రెండు కిలోమీటర్ల మేర స్వారీ చేయించాడు. జమీందారు స్వారీలో చేతి వేళ్ళు విరగగా మోకాళ్ల తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ పోరాటంలో 300 మంది పాల్గొన్నారు. పేదలకు భూములు దక్కాయి. ఉద్యమంలో పాల్గొన్న 300 మందిని అరెస్టు చేసి ఆరు నెలల జైలు శిక్ష విధించి రాజమండ్రి జైలుకు పంపారు.

దివి తాలూకాలో కూలీ సంఘాన్ని స్థాపించి కూలీ సామాజిక న్యాయం భూముల రక్షణ తదితర అంశాలపై అనేక పోరాటాలలో చల్లపల్లి నారాయణరావు ఇతర కామ్రేడ్లతో పాటు నాయకత్వం వహించారు. 1994లో అఖిల భారత రైతు మహాసభ పిలుపులో భాగంగా సుందరయ్య నాయకత్వంలో బందరు కాలువ తవ్వకానికి వందలాది మంది రైతులను నారాయణరావు సమీకరించారు. ఆహార ధాన్యాలను చౌకగా ఇవ్వాలని దివి తాలూకాలో జరిగిన ఆకలి యాత్రకు నాయకత్వం వహించారు. 1937లో గుడివాడ తాలూకా వెంట్రప్రగడలో జరిగిన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలో జిల్లా అధ్యక్షునిగా చల్లపల్లి నారాయణరావు, కార్యదర్శిగా గుంటూరు బాపనయ్య ఎన్నికయ్యారు.

1947లో ఏప్రిల్ 10, 11 వ తేదీలలో గాజులలంకలో జరిగిన ఉద్యమంలో చల్లపల్లి నారాయణరావు పాల్గొన్నారు. పోలీస్ కాల్పులలో వీరనారి బావిరెడ్డి వియ్యమ్మతో సహా నలుగురు కామ్రేడ్లు నేలకు వరిగారు చల్లపల్లి నారాయణరావును అనేకమంది కామ్రేడ్లని పోలీసులు తీవ్రంగా నిర్బంధించారు. నిర్బంధాలు ఎక్కువ కావడంతో చల్లపల్లి నారాయణరావు పలువురు నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లి ఉద్యమాలను కొనసాగించారు. జమీందారు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ మారువేశాలతో తిరుగుతూ ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు ధైర్య సాహసాలు చెబుతూ దీక్ష దక్షతలు ప్రదర్శించి ప్రజలకు విశ్వాసాన్ని కల్పించారు. ఫలితంగా ఆరువేల ఎకరాలు రైతుల పరమయ్యాయి 1947లో ముఖ్యమంత్రి జారీచేసిన ఆర్డినేట్ ప్రకారం కమ్యూనిస్టు నాయకులను రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులను పెద్ద ఎత్తున అరెస్టు చేయడం ప్రారంభించారు. నారాయణరావు రహస్య జీవితం గడిపారు. భార్య సత్యవతి అనేక నిర్బంధాలకు అవమానాలకు గురి చేశారు. అయినా ఆవిడ ధైర్యంతో నిలబడ్డారు. నారాయణరావుకి ముగ్గురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. దివి తాలూకాలో నాగాయలంక మండలం తలగడదీవి కొత్తపాలెంలో రహస్యంగా ఉంటూ జ్వరంతో బాధపడుతున్న చల్లపల్లి నారాయణరావును గోగినేని తాతయ్యలను ఎట్టకేలకు పోలీసులు పసిగట్టి నిర్బంధించారు. 1950 మే 12వ తేదీ తెల్లవారుజాము వరకు రోజంతా చిత్రహింసలు గావించారు. అయినా సరే ఆయనతో ఒక రహస్యం కూడా చెప్పించలేకపోయారు. అదే రోజు అర్ధరాత్రి సమయాన ఇద్దరినీ పొలాల్లోకి తీసుకువెళ్లారు రెక్కలు విరిచి చెట్లకు కట్టేశారు. ఈ పోలీసు క్యాంపుకు నాయకుడు దుర్మార్గుడు డిఎస్పి పలనియప్పన్ మద్రాసు.

నారాయణరావు చివరి కోరిక

ఈ సందర్భంగా నారాయణరావు డిఎస్పి పలనియప్పన్‌తో నా కోరికను నెరవేర్చమని కోరారు. ఆ కోరిక ఏమిటంటే తనని వదిలివేయమని కాదు తనతో పాటు రెక్కల విరిచి కట్టేసిన గోగినేని తాతయ్యకు పెళ్లి అయ్యి పది రోజులు మాత్రమే అయింది. నన్ను కాల్చుకోండి కానీ తాతయ్యని వదిలివేయమని ప్రాధేయపడ్డాడు. తాతయ్యని వదిలివేయగా పారిపోతున్న తాతయ్యను సాయుధ పోలీసులు కాల్చివేశారు. ఆ సందర్భంలో నారాయణరావుకి పట్టలేని కోపం వచ్చింది. తదుపరి నారాయణరావుని తొడలో కాల్చారు. ఉగ్రుడైన నారాయణరావు ఓరి పిరికిపందల్లారా మనిషి ప్రాణం ఉండేది తొడలో కాదురా... గుండెల్లో.. దమ్ముంటే కాల్చుకోరా అని సవాలు విసిరాడు. దీంతో నారాయణరావుని కూడా కాల్చివేశారు. ఆ ఇద్దరి మత దేహాలను ఇవ్వమని కోరిన ఇవ్వకుండా దహనం చేశారు. పోలీసులు రక్తం చిందించిన ఆ దళితవాడలో నారాయణరావు, తాతయ్య పేరున స్తూపం నిర్మించారు. ఆరోజు దివిసీమ ఒక పోరాట యోధుడిని కుటుంబ సభ్యుడిని కోల్పోయామని ప్రజలు భావించారు. దివిసీమలో ఇరువురిని కాల్చివేయడంతో నిర్ఘాంత పోయింది. దివిసీమ ప్రజలు తమ పిల్లలకు ప్రతి పదిమందిలో ఏడుగురికి కుమారుడైతే నారాయణరావు అని, కుమార్తె అయితే నారాయణమ్మ అని నామకరణం చేసుకున్నారు. సిపిఎం పోరాటంతో 227 ఎకరాలలో 2500 కుటుంబాలతో నిర్మించిన పురానికి చల్లపల్లి నారాయణరావు నగర్ గా నామకరణం చేశారు.

యద్దనపూడి మధు
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రతి ఒక్క పౌరుడు ఒక సైనికునిలా మారి దేశం కోసం పోరాడాలని ఉపాధ్యాయులు రాజు అన్నారు. స్థానిక గ్రేడ్ 2 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు తెలివిగల రాజు కథ చదివి వినిపించడం కష్ట సమయాలలో ఏ విధంగా స్పందించాలో విద్యార్థులు తెలుసుకున్నారు. అనంతరం కప్పగంతుల పోటీలను నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారిని టి వాణి తెలిపారు. **ప్రజాశక్తి - పామర్రు :** శాఖా గ్రంథాలయం జమీగొల్వేపల్లిలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా ఆదివారం విద్యార్థులకు సామూహిక పఠనా కార్యక్రమం నిర్వహించారు ఈ .కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు వి.నాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పామర్రు శాఖా గ్రంథాలయంలో జరిగిన శిక్షణ శిబిరంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి అనంతరం యోగాబ్యాసంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి ఎం. ఝాన్సీ రాణి, బి.విజయ కుమారి పాల్గొన్నారు.

పామర్రు మండలంలో యోగా చేస్తున్న విద్యార్థులు

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులుగా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా ఎస్. ఎస్.ఎన్ .ఎం.వి.ఆర్.వి, ప్రసాదును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ అధ్యక్షులుగా ఎం . ఉమా మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి కుమార్, ఏ కోదండరామ్, కార్యదర్శులుగా ఎస్ రాము , సంయుక్త కార్యదర్శులుగా నాగలక్ష్మి, గోపికష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కె జాబార్, కోశాధికారిగా ఎం నాగలక్ష్మి ను ఏకగ్రీవం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిక వ్యవహరించిన ఆర్ శ్రీనివాస్, కే కొండయ్యలు తెలిపారు.

14న గుడివాడ ఎఎన్ఆర్ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : నైపుణ్యాల అభివద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకుగాను ఈ నెల 14 న బుధవారంఉదయం 9 గంటల నుండి గుడివాడలోని "అక్కినేని నాగేశ్వరరావు(ఏ ఎన్ ఆర్) కళాశాలలో "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, తెలియజేసారు. ఈ జాబ్ మేళాలో, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎమ్ఆర్ఎఫ్ లిమిటెడ్, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్సు, గోదావరి కష్ణ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్, సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పేటిఎమ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్, సిఎం ఆర్ షాపింగ్ మాల్ తదితర ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని జిల్లా ఉపాధి అధికారి డి. విక్టర్ బాబు మరియు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు.

ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసి, పీజి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులని అన్నారు. ఎంపిక అయిన వారికి ఆసక్తికర వేతనముతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 98488 19682, 96666 54641, 96767 08041 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశకి- గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలం లోని వేమవరం గ్రామంలో ఉన్నశ్రీ కొండ లమ్మ అమ్మ వారిని అధిక సంఖ్యలో యాత్రికులు ఆది వారం దర్శించు కున్నారు. ఆదివారం సందర్భంగా సుమారు 20వేల మంది యాత్రికులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం వద్ద ఎలాంటి అవాం ఛనీ య సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్య నారాయణ వారి సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

20న బహుజన సంకల్ప సభ

ప్రజాశక్తి-అవనిగడ్డ : బహుజన సమాజ్వాద పార్టీ రాష్ట్రవ్యాప్తంగా బహుజన సంకల్ప సభలు నిర్వహించనున్నట్లు, అందులో భాగంగా ఈనెల 20వ తేదీన చల్లపల్లిలో బహుజన సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథులు విశిష్టా థితులుగా రాష్ట్ర విశ్రాంతి డిజిప డాక్టర్ జే పూర్ణచంద్రరావు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ పాల్గొం టున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దాల బాల య్య నియోజకవర్గ అధ్యక్షులు వంగలపాటి వెంకటేశ్వరరావు, జిల్లా నాయ కులు గుంటూరు కార్తిక్, చిట్టూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీపెట్ డిప్లొమా దరఖాస్తుకు 29 వరకు గడువు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఉద్యోగ కల్పనే లక్ష్యంగా భారత ప్రభుత్వ విద్యాసంస్థ సీపెట్ పలు డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్, హెడ్ డాక్టర్ సిహెచ్ శేఖర్ ఆదివారం తెలిపారు. సీపెట్ విజయవాడలో ఉద్యోగ కల్పనే లక్ష్యంగా 10 వతరగతి పాసయిన విద్యార్థులకు 3 సంవత్సరాల వ్యవధిగల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డిపిటి), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డిపిఎంటి), బి.యస్సీ విద్యార్థులకు 2 సంవత్సరాల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ అనే 3 కోర్సులను అందిస్తున్నారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి, నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు అందజేస్తారు. దరఖాస్తుదారులు ఈనెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్, హెడ్ డాక్టర్ సిహెచ్.శేఖర్ తెలిపారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్ జూన్ 8న విజయవాడ, అనంతపురంలో నిర్వహించి, ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో ఉన్న 150 సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థ (ఎంఎన్‌సి), అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజనీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్, మేకర్, జూనియర్ ఇంజనీర్ (మైంటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ వంటి ఉద్యోగ అవకాశాలు పొందుతారు. ప్రారంభ వేతన స్థాయి నెలకు రూపాయలు రూ.18వేల నుండి 22వేల వరకూ ఉంటుందని, సాధారణ విద్యార్థులు కూడా మెరుగైన విజయాన్ని సాధించవచ్చని, ఆన్లైన్ దరఖాస్తు విధానం, ఇతర సహాయతకోసం 9398535697 నెంబర్లో సంప్రదించాలని శేఖర్ సూచించారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : శ్రీ వాసవి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ వ్యాపారి అప్పన మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట నియోజవర్గం మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసరావు, మురళీకృష్ణ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పన మురళీకృష్ణ, బండారు సెదశ్వరరావు, డోగ్గుపర్తి రమేష్, ఎ.అశోక్, స్వామి, దిలీప్, వాసవి సేవా సమితి జిల్లా ప్రతినిధి పేరూరి నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు యన్నాకుల రాంబాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కర్లపాటి కొండ, వరగాని రాజశేఖర్, యన్నాకుల అభిరామ్ పాల్గొన్నారు.

బాధితుడికి సాయం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విసన్నపేట మండలం తాతకుంట్ల గ్రామం పేరాబత్తుల దళితవాడకు చెందిన జనసేన కార్యకర్త ప్రత్తిపాటి ప్రేమ్‌చంద్‌కు ఇటీవల లారీ ప్రమాదంలో కాలికి తీవ్ర గాయమై శస్త్ర చికిత్స ద్వారా ఆపరేషన్ చేయించారు. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతుండటంతో పార్టీ నాయకులు పరామర్శించి బియ్యం, ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు షేక్ యాసిన్, మండల కార్యదర్శి సాలి నాగరాజు జనసేన తాతకుంట్ల,్యక్షులు పరసా సతీష్ కుమార్ ఉపాధ్యక్షులు దమ్మలపాటి నాగేశ్వరరావు గార్లపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది నాగభూషణం మృతికి నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 3వ వార్డు చెందిన వైసిపి నాయకులు, సీనియర్ న్యాయవాది, జగన్ ప్రభుత్వంలో ఎపి హైకోర్టు ఎజిపిగా సేవలందించిన అమృత నాగభూషణం (60) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు నాగభూషణం నాగభూషణం మతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాక సుందర్ రావు, సీనియర్ న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాసరావు, యువజన ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్, ప్రచార విభాగ అధ్యక్షులు గోగుల వెంకయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నాగభూషణం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు, తదితరులు (ఇన్సెట్లో) ఫైల్ ఫోటో

కార్మిక వర్గ డిమాండ్ల సాధనకు 20న సమ్మె

ప్రజాశక్తి - తిరువూరు : లేబర్ కోడ్స్ రద్దు కార్మిక వర్గ డిమాండ్ల పరిష్కారం కోసం మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సీహెచ్ శ్రీనివాస్ అన్ని వర్గాల కార్మికులకు పిలుపునిచ్చారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు విస్త త సమావేశం నాగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగినది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్దించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లపై మే 20న సమ్మె చేయాలని సిఐటియుతో పాటు మరో 11 కేంద్ర కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెను కార్మికులు, ఉద్యోగులు, స్కీము వర్కర్లు, చిరు వ్యాపారులు పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి వెంకటేశ్వర రావు, సిఐటియు నాయకులు పుల్లారావు, సామ్రాజ్యం, రమణ, ఎం బాబు, ఇశ్రాయేలు, ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్.శ్రీనివాస్

మార్పులకనుగుణంగా ఆక్వా శుద్ధజలం

ఆర్ ఆర్ బేవరేజెస్ కంపెనీని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మానవ జీవన శైలిలో అనేక మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయని అందులో శుద్ధ జలం ప్రాముఖ్యత రోజుకు పెరుగుతూ ఉందని దానికి అనుగుణంగా మంగళగిరి మండలం ఎర్రబాలెంలో ఆక్వా వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం అభినందనీ మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో పారిశ్రామిక వాడ నందు ఆర్ ఆర్ బేవరేజెస్ ఆధ్వర్యంలో నూతనంగా పుల్లీ ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతం ఇటువంటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం ఉన్నారు. ఆర్ఆర్ బేవరేజెస్ సంస్థ ఆక్వా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సంస్థ పార్టర్స్ ఎల్.రాధిక, భీమిరెడ్డి రవీంద్రలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, టిడిపి నాయకులు, మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, ఉమా మహేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, నాయకులు పాశం రామారావు, ఈమని అప్పారావు, డి.వెంకట రెడ్డి, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం ఏ . షిష్టి, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, ప్రముఖ పారిశ్రామికవేత్త పి.నరసింహారావు, ప్రముఖ ఆడిటర్ నరసింహ, టీడీపీ, జనసేన, సిపిఎం నాయకులు, పారిశ్రామికవేత్త ఎస్. రామరాజు పాల్గొన్నారు.

ప్లాంటు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కె.ఎస్.లక్ష్మణరావు, డి.రమాదేవి

అంకమ్మ తల్లి కొలుపు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో కాపుల బజారున వేంచేసియున్న అంకమ్మ తల్లి అమ్మవారి కొలుపు మహోత్సవం ఆదివారం నిర్వహించారు. గ్రామ దేవత, అంకమ్మ తల్లిని సుమారు రెండు దశాబ్దాల నుండి ఏడాది విడిచి ఏడాది ఈ కొలుపు మహోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. యాత్రికులు అమ్మవారికి నీళ్ల ఆరబోస్తూ ప్రసాదాలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా కొలుపు మహోత్సవం చూసేందుకు సందర్శకులు రావడంతో కిటకిటలాడింది.

మాజీ మంత్రి విడదల రజినిపై దురుసు ప్రవర్తన సరికాదు

ప్రజాశక్తి - వత్సవాయి : మాజీ మంత్రి బిసి నేత విడదల రజినిపై అనుచిత ప్రవర్తన చేసిన చిలకలూరిపేట రూరల్ సిఐ సుబ్బారాయుడి తీరును వైసిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు ఖండించారు. ఈ మేరకు స్థానిక పెనుగంచిప్రోలు గ్రామంలోనీ సత్రం సెంటర్ వద్ద ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమెట్ల శంకర్ రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

నెట్టెంకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గిరిజన సంఘం రాష్ట్ర సంఘ నాయకులు కె డి సి సి చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం కు పదవి ఇచ్చినందుకు పట్టణంలోని రఘురాం నివాసంలో ఆదివారం గిరిజన నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలుగున్న గిరిజన నాయకులు సిమ్మ సర్తి శ్రీనివాస్ గిరిజన సంఘం రాష్ట్ర ఆర్గానైజింగ్ కార్య దర్శి, బొజ్జగాని మురళీకష్ణ గిరిజన సంఘం రాష్ట్ర కోశాధికారి, మెచర్ల లక్ష్మయ్య గిరిజన సంఘ నాయకులు, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పడావుగా స్థలం.. వినియోగంలోకి తెస్తే ఉపయోగం

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి భరతమాత విగ్రహం దగ్గర నుండి కుంచనపల్లి ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం వరకు సుమారు రెండు కిలోమీటర్లు దూరం గల బకింగ్ హోమ్ కాలువ వెంబడి బ్రహ్మాండమైన స్థలం ఉంది. ఈ స్థలంలో ప్రస్తుతం పట్టణంలో వివిధ ప్రాంతాల నుండి సేకరించుకొచ్చిన చెత్తతో పాటు కొంతమంది తమ ఇళ్లల్లోని వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ పడేస్తున్నారు. సాయంత్రం పూట, ఉదయం సీనియర్ సిటి జెన్లు వాకింగ్ ట్రాక్‌గా ఈ రోడ్డును వినియోగిస్తున్నారు. భరించరాని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కట్ట పొడవునా సుమారు 10 ఎకరాల స్థలం ఇక్కడ పడావుగా పడి ఉంది. ఈ భూమిని వినియోగంలో కొట్టేస్తే రైతు మార్కెట్ ఇక్కడ పెట్టే అవకాశం ఉంటుంది. అలాగే పెద్ద ఎత్తున అపార్ట్మెంట్లు సంస్కృతి విస్తరిస్తున్న తాడేపల్లి బైపాస్ రోడ్డుకు ఈ ప్రాంతంలో రైతు మార్కెట్ పెడితే దగ్గరగా ఉండటంతో పాటు అందుబాటులో ఉంటుందనే అభిప్రాయం ఇటీవల పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు ఈ ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా అభిప్రాయపడ్డారు. వేలాదిమంది ఎక్కడెక్కడ నుండో వచ్చి ఇక్కడ అపార్ట్మెంట్లో ప్లాట్లు కొనుగోలు చేసి స్థిరపడుతున్నారు. వీరందరూ ఇప్పుడు కూరగాయలు కొనుగోలు చేయాలంటే సరైన రైతు బజార్ లేక విజయవాడ నగరానికి వెళ్లాలి చేస్తుందని చెబుతున్నారు. పైన పేర్కొన్న ప్రదేశంలో వ్యర్థాలను తొలగించి కాలవ వైపు పెన్షన్ వేసి రైతు బజార్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యాలు కల్పించిన వారు అవుతారని, ఎం టిఎంసి అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పెద్ద ఎత్తున ఖాళీ స్థలం ఉండటంతో రైతు బజార్ తో పాటు మాంసం విక్రయాలు కూడా జరపటానికి వీలుగా ఇక్కడ కబేలా ఏర్పాటు చేయాలని కూడా స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం కబేలా లేకపోవడంతో ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం కాలువలో వ్యర్థాలు అన్నిటిని పడేస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. దీనివల్ల కాలువలో నీరు కలిసి ఉండటంతో పాటు చుట్టుపక్కల ప్రజలకు అనారోగ్యాలు పాలయ్యే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ఇటు రైతు బజారు, ఆటు మాంసం విక్రయాలకు కబేలా ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానికులు డిమాండ్ ను పట్టణ పౌర సంక్షేమ సంఘం బలపరుస్తుందని కన్వీనర్ జై.శేషయ్య తెలిపారు.

చెత్తా చెదారంతో నిరుపయోగంగా ఉన్న స్థలం

విద్యుత్ కోతలతో నరకం

- ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి
- ఉక్కపోత, దోమలబెడదతో జాగారం

ప్రజాశక్తి- నందివాడ : మండలంలో అనధికార విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల్లో ఏదో ఒక సమయంలో ఎప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందో తెలియని పరిస్థితి నెలకొంది. సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల పేరిట విద్యుత్‌ను సిబ్బంది నిలిపివేస్తున్నారు. నందివాడ మండలం లో అనధికార విద్యుత్ కోతలు డిమాండ్‌కు అనుగుణంగా లేని సరఫరా ఈఎల్ఆర్ పేరుతో గంటల తరబడి కోతలు అనధికార కరెంటు కోతలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వానొచ్చినా గాలి కొట్టినా కరెంట్ కట్ కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో, పోతే మళ్లీ ఎప్పుడు వస్తుందో అర్థం కాని అయోమయ పరిస్థితులు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్నాయి. పగటిపూట కరెంట్ పోయినప్పటికీ అటుఇటుగా సర్దుకుంటున్న ప్రజలు రాత్రి పూట కరెంట్ పోతే మాత్రం ఉక్కపోత, దోమలబెడదతో జాగారం చేయాల్సి వస్తోంది. నాలుగేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం విద్యుత్ కోతలు ఉంటున్నాయి. అనధికార కోతలతో ప్రజలు అల్లాడుతున్నా విద్యుత్ శాఖ అధికారులకు పట్టడంలేదు. విద్యుత్ సరఫరాలో అనేక లోపాలు ఉన్నప్పటికీ బిల్లులు మాత్రం వేలకు వేలు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్పత్తికన్నా వాడకం ఎక్కువ కావడంతో ఎమర్జెన్సీ లోడు రిలీఫ్ (ఈఎల్ఆర్) కింద కరెంటు కోతలు తప్పడంలేదని ఆ శాఖ ఉద్యోగులు చెప్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఎక్కడా కోతలు లేవు.. మరమ్మతుల సమయంలో మాత్రం సరఫరాలో అంతరాయం కలుగుతుంటుందని చెప్తున్నారు.

కరెంటు కోతలు తగ్గించాలి

సనపల శ్యామ్ సుందర్ రాజు, లక్ష్మీనరసింహాపురం

కరెంటు కోతల వలన నిద్రహారాలు కోల్పో తున్నాం. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. వొల్టెజ్ కారణంగా ఇంట్లో మిక్సీలు, ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నాయి. విద్యుత్ సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

వోల్టేజ్ సరిపోవడం లేదు,

గంటసాల బాపూజీ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు

లక్ష్మీనరసింహాపురం శివారు గ్రామం కావడంతో తగినంత విద్యుత్ సరఫరా రావడంలేదు. ఉదయం 9గంటల నుండి 10 వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 11 గంటల సమయంలో లోవోల్టేజి సమస్య ఎక్కువగా ఉంది. కనీసం ఫ్యాన్ కూడా తిరగడం లేదు. లోఓల్టేజి కారణంగా మోటార్లు పనిచేయడం లేదు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ అనువంశిక ధర్మకర్త పాత రాజు భాస్కరరావు లక్ష రూపాయల వ్యయంతో స్వామివారికి సమకూర్చిన శేష వాహనాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. నూతన శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించాక స్వామివారి విగ్రహాలను ప్రధాన వీధుల మీదుగా భక్తుల దర్శనార్థం ఊరేగించారు. ముందుగా వార్షిక బ్రహ్మో త్సవాల సందర్భంగా అర్చక స్వాములు దేవస్థానంలో నిత్య హోమం బలిహరణం నసింహ జయంతి నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ విజయలక్ష్మి దంపతులు, వారి కుమార్తె అల్లుడు శీలం కష్ణప్రభ అశ్విని కుమార్ దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి లక్ష్మీనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు ఆలయ అనువంశిక ధర్మకర్త పోతరాజు భాస్కరరావు నేతత్వంలో ఆలయ అర్చకులు దేవాదాయ శాఖ సిబ్బంది అతిథులకు ఘనంగా స్వాగతం పలికి ప్రసాదం అందజేశారు.

ముళ్లపొదల తొలగింపు

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ గ్రామంలో ఉన్న పోలాశమ్మ అమ్మవారి జాతర జరుగుతుండడంతో ఆలయంకు వెళ్లే దారికి ఇరువైపులా ముళ్ళపదలు పెరగడంతో గ్రామ పెద్దలు పంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ దష్టికి తీసుకురాగా స్పందించిన సర్పంచ్ దగ్గరుండి మరి జంగిల్ క్లియరెన్స్ చేయించారు. గ్రామంలో భక్తులు సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌కు, పంచాయతీ కార్యదర్శి బి అనితకు ధన్యవాదాలు తెలిపారు.

దగ్గరుండి జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న సర్పంచ్ విజయ్ కుమార్

ధర లేక మామిడి రైతు దిగాలు

- దిగుబడులూ అంతంతమాత్రం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం డివిజన్లో మామిడి రైతుల జీవితాల్లో తియ్యదనం కరవైంది. మామిడిని పండించిన రైతులు ఈ ఏడాది దిగుబడిలోనూ, ధరలోనూ పెద్దగా ప్రగతి లేకపోవడంతో కుదేలయ్యారు. గన్నవరం, విజయవాడ రూరల్, బాపులపాడు మండలంలోని పలు గ్రామాలు మామిడికి ఎంతో ప్రసిద్ధి. ఏటా ఇక్కడ నుంచి లక్ష టన్నుల వరకు ఇతర ప్రాంతాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తారు. ఈ ఏడాది మామిడి దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోవడం, కాసిన అడపాదడపా తోటల్లోనూ దిగబడులు వచ్చినా.. వాటికి అనుకున్న స్థాయిలో ధరలు లేకపోవడంతో మామిడి మార్కెట్లలో కళ తగ్గింది. వ్యాపారాలు బోసిపోతున్నాయని వ్యాపారులు దిగులు చెందుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి మామిడి తోటలను కొనుగోలు చేసిన రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు రాలేదని ఆందోళన చెందుతున్నారు. గన్నవరం, బాపులపాడు తదితర మార్కెట్లకు పెద్దఎత్తున మామిడి వ్యాపారం ఉండేది. ఆశించిన మేర దిగుబడులు లేకపోవటంతో కొందరు కొనుగోలుదారులు పొలాల వద్దకు వెళ్లి అక్కడే కొనుగోలు చేస్తున్నారు. గన్నవరం డివిజన్లో 16 వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, చీడపీడలతో అనుకున్న స్థాయిలో దిగుబడులు రాలేదు. ఎకరాకు 2 టన్నుల వరకు మాత్రమే వచ్చాయం టున్నారు. టన్ను బంగినపల్లి రకం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతోందని చెప్పారు. ఏటా దాదాపు రూ. కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు మామిడి ఉత్పత్తుల ద్వారా టర్నోవర్ జరిగేదని, ఈ ఏడాది అంత ఎత్తున జరగలేదంటున్నారు. మామిడిలో తోతాపురి, రసాలు, ఇతర రకాలకు సంబంధించిన వాటి ధరలు కూడా మరింత తగా దిగజారాయని చెబుతున్నారు. వాటి ధర కూడా రూ.12 వేల నుంచి రూ.20 వేల లోపు మాత్రమే ఉన్నాయని, వచ్చిన అంతంతమాత్రం దిగుబడులతో ఈ ధరలు మరింతగా తమను కుంగదీస్తున్నాయని చెబుతున్నారు. మార్కెట్లలో వ్యాపారుల వద్ద మాత్రం రసం కాయ రూ.50 నుంచి 60 వరకు ధర పలుకుతున్నా... రైతుల జీవితాల్లో మాత్రం కాంతులీనడం లేదు. అయితే కమిషన్ వ్యాపారులు బాగా లాభం పొందుతున్నారని వాదన ఉంది. వ్యాపారులను కేంద్రంగా చేసుకొని వీరు పెద్ద ఎత్తున లాభం గడిస్తున్నారు.

గతేడాది కంటే తక్కువే

రాంబాబు , వ్యాపారి

గతేడాది నాలుగైదుతోటల్లో మామిడిని రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చుపెట్టి కొనుగోలు చేశాం. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో తోటల దగ్గరికెళ్లి కొనుగోలు చేయాలంటేనే భయపడ్డాం. ఎలాగోలా ధైర్యం చేసి మామిడితోటలు కొనుగోలు చేశాం. దిగుబడులు పెద్దగా రాలేదు, కనీసం ధరలైనా ఆశించిన స్థాయిలో ఉంటాయనుకుంటే వాటి పరిస్థితి దారుణంగానే తయారైంది.

14వ రోజుకు సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యం మందిరం విలేజ్ క్లినిక్ ఆఫీసర్లు సమ్మె ఆదివారంతో 14 రోజుకు చేరింది. రెండు సంవత్సరాలుగా పేరుకుపోయిన వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ కృష్ణా జిల్లా సిహెచ్‌ఓలు సమ్మె బాట పట్టగా గత శుక్రవారం ప్రభుత్వం 6 నెలల బకాయిల నిధులను విడుదల చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై సిహెచ్‌ఓ లు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఇతర డిమాండులైన వేతన సవరణ అంశం, ప్రోవిడెంట్ ఫండ్ మొదలగు సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకురాలు ఝాన్సీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్

వడ్డెరల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుడివాడ : జూన్ నెల చివరి వారంలో నెల్లూరు నగరంలో జరిగే ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ప్రముఖ న్యాయవాది, వడ్డెర వత్తిదాల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారులు సంఘం కష్ణా జిల్లా గుడివాడ టౌన్ విస్తతస్థాయి సమావేశం ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పుతల ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశములో ముఖ్య అతిథిగా పాల్గొన్న దయాకర్ సంఘం నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ వడ్డెర కార్పొరేషన్ చైర్ పర్సన్, డైరెక్టర్లను వెంటనే ప్రకటించాలన్నారు. వడ్డెర కార్పోరేషన్‌కు రూ.1000 కోట్లు నిధులు కేటాయించి కార్పొరేషన్ విధి విధానాలను ప్రకటించి కార్పొరేషన్ ద్వారా వడ్డెరలకు 90శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను అందించి వత్తిదారుల సంక్షేమానికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చంద్రగిరి శివనాగ మల్లేశ్వరరావు, పట్టణ కార్యదర్శి బత్తుల నాగరాజు, మహిళా అధ్యక్షురాలు తమ్మిశెట్టి నాగ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - పామర్రు : మండల పరిధి పెదమద్దాలి గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన వార్షిక కళ్యాణ మహోత్సవానికి హైకోర్టు జడ్జి బి. కృష్ణమోహన్ సతీ సమేతముగా హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో గుడివాడ 11 వ అడిషనల్ జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం, సబ్ జడ్జి వి. వాసుదేవ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, పామర్రు పోలీస్ సిబ్బంది,ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న హైకోర్టు జడ్జి బి. కృష్ణమోహన్

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నేడు ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యా శాఖ అధికారిని కలిసిన వారిలో జిల్లా సహాధ్యక్షురాలు పి.లీల, రాష్ట్ర కౌన్సిలర్ ఎ.అనంత్ కుమార్, ఎస్.చలపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

పాలిమర్ సొల్యూషన్స్ విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పాలిమర్ ఆధారిత సొల్యూషన్స్ అగ్రగామి సంస్థగా పేరు తెచ్చుకున్న రెహా దేశంలో తన కార్యకలాపాలు మరింతగా విస్తరించనున్నట్లు రెహా ఇంటీరియర్ సొల్యూషన్స్ సిఇఒ డాక్టర్ థామస్ ట్రోగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ సిటీలో 1.05 ఎకరాల పారిశ్రామిక భూమిని కొనుగోలు చేసిందన్నారు. తద్వారా తన ఫుట్ ప్రింట్‌ను మరింతగా విస్తరించే దిశగా ఒక కీలకమైన అడుగు వేసిందని అన్నారు. రెడ్‌స్టార్ పాలిమర్స్ ప్లాంట్ సమీపంలో 99 సంవత్సరాల లీజు ఒప్పందం ద్వారా ఈ భూమిని పొందిందన్నారు. దీంతో రెడ్‌స్టార్ పాలిమర్స్ తన తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో మద్దతివ్వడానికి రెహా ఇండియా ద్వారా వ్యూహాత్మక పెట్టుబడిని సూచిస్తుందన్నారు. రెహా ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తుషార్ వర్మ మాట్లాడుతూ భారతదేశంలో మరింత పెట్టుబడి పెట్టాలనే నిర్ణయం దేశ దీర్ఘకాలిక మార్కెట్ సామర్థ్యంపై తమ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. ఈ విస్తరణ ద్వారా పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, తయారీ నైపుణ్యాన్ని బలోపేతం చేయడానికి వీలు కల్పిస్తుందని అన్నారు.

ఇంద్రకీలాద్రి నృత్య కళార్చన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సనాతన ధర్మ ప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు గానూ కనకదుర్గమ్మ సన్నిధిలో నూతన రాజగోపురం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్యప్రదర్శనలు జరిగాయి. విజయవాడ నగరానికి చెందిన శ్రీ కనకదుర్గ నృత్యమందిర్ నృత్య విద్యార్థులు కనకదుర్గ అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. కుమారిసాయి సహస్ర ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులు తమ ప్రదర్శనలో భాగంగా పలు భక్తి కీర్తనలకు 20 మంది లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శన అనంతరం కళా బృందానికి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

విశిష్ట మహిళలకు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ మాతృ దినోత్సవ వేళ.. భరత మాతకు తెలుగునాట క్రియేషన్స్ ఘనంగా నీరాజనాలర్పించింది. వివిధ రంగాల్లోని విశిష్ట మహిళలను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి, ఆ మాతృమూర్తులను ఘనంగా సత్కరించి గౌరవించింది. మన దేశానికి చెందిన ఇరువురు మహిళా యోధులు ముందుండి నడిపించిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని మాతృ దినోత్సవ సాక్షిగా సంబరంగా జరుపుకున్నారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి తెలుగునాట క్రియేషన్స్ వారు రూపకల్పన చేశారు. నగరంలోని హోటల్ మురళీ ఫార్చ్యూన్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం మాతృ దినోత్సవ స్ఫూర్తిని, దేశ రక్షణలో మన మాతృమూర్తుల త్యాగ నిరతిని ఘనంగా చాటి చెప్పింది. సీనియర్ ఐపిఎస్ అధికారి, నగర డీసీపీ కె.జి.వి. సరిత, ప్రముఖ మోటివేషన్ స్పీకర్ భారతీయం సత్యవాణి, ప్రఖ్యాత కూచిపూడి నత్యకారిణి స్వాతి సోమనాథ్, అక్కినేని గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మణి అక్కినేని, ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ శ్రుతి రెడ్డి, చంద్రగిరి జెడ్పీటీసీ పద్మజా రెడ్డి, ఆదర్శ రైతు ఈశ్వరమ్మ, ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, ప్రొడక్షన్ డిజైనర్ మోనికా నిగోత్రే, రంగస్థల కళాకారిణి బుర్రా విజయలక్ష్మి, సంస్థితి డైరెక్టర్ ఎం.ఎల్. త్రిపుర సుందరిలను ఘనంగా సన్మానించారు.

సన్మానం అందుకున్న మహిళలు

కార్యక్రమంలో తెలుగునాట క్రియేషన్స్ అధినేత మాదల వేణు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ఘన విజయం మన దేశంలోని మాతృమూర్తులందరి విజయమని అన్నారు. ఎందరో మాతృమూర్తుల త్యాగాల ఫలితంగా వికసిత్ భారత్ స్వప్నం సాకారమవబోతోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మాదల వేణు వివరించారు. సన్మాన గ్రహీతలకు త్రివర్ణ పతాకంతో పాటు, సిందూరం నింపిన భరిణెలను నిర్వాహకులు కానుకగా అందజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఇన్‌చార్జ్ పోలీస్ కమిషనర్ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాల్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రెస్ కోడ్ పాటించరే...

ప్రజాశక్తి - వత్సవాయి :
మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయ ఇఒ బిహెచ్‌విఎస్ఎన్.కిషోర్ కుమార్ డ్రెస్ కోడ్ పాటించకుండానే అమ్మవారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ వస్త్రధారణకు భిన్నంగా వచ్చర్ల, షర్టు టీ షర్ట్‌తో అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఆలయ అధికారులను కలిసి పరిశీలించారు. ఆలయ అధికారులు అందరూ తెల్ని సాంప్రదాయ దుస్తులు ధరించాల్సి ఉంది. ఉద్యోగులందరికీ మార్గ దర్శకంగా ఉండాల్సిన ఆలయ నిర్వహణ అధికారి డ్రెస్‌కోడ్ పాటించకపోవటంపై కొందరు అభ్యంతరం తెలుపుతున్నారు.

క్రికెట్ టోర్నీలో తలపడ్డ ఆరు జట్లు

ప్రజాశక్తి - వీరులపాడు : గ్రామీణ ప్రాంతంలోని క్రికెట్ క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి తీసుకువచ్చేందుకు మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్లు దోహదపడతాయి. కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినందుకు జమ్మవరం హైస్కూల్ మాజీ చైర్మన్ మంగళపూడి వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. జమ్మవరం గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మూడో రోజు ఆదివారం మూడు మ్యాచులు జరిగాయి. ఈ మ్యాచులు వీక్షించేందుకు జమ్మవరం హైస్కూల్ మాజీ చైర్మన్ మంగళపూడి వెంకటేశ్వరరావు అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పోటీ పడ్డాయని తెలిపారు. శుక్రవారం మూడు మ్యాచులు జరిగ్గా, శనివారం నాలుగు మ్యాచులు జరిగినట్లు తెలిపారు. గ్రామాల పరిపూర్ణ వికాసం కోసం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ పంచాయతీ కార్యక్రమం కూడా ప్రజలకు బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ టోర్నమెంట్ మూడు రోజు జరిగిన మొదటి మ్యాచ్‌లో ఎమ్.ఎన్.కె యూత్ పొన్నవరం జట్టుపై కిషోర్ టీమ్ నందలూరు 12 పరుగుల తేడా విజయం అందుకుంది. ఇక రెండో మ్యాచ్‌లో

ఎన్ఎఫ్‌సి యూత్ జుజ్జూరు జట్టు వెల్లంకి వారియర్స్ జట్టుపై 26 పరుగుల తేడాతో గెలిచింది. మూడో మ్యాచ్‌లో ఎంఎంసిసి 2 అల్లూరు జట్టుపై యువసేన ఓల్డ్ జమ్మవరం జట్టు 1 పరుగు తేడాతో విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఛాంపియన్స్ యర్రంరెడ్డి ప్రదీప్ కుమార్, కట్టా సునీల్, సింగి సురేష్, కొప్పుల రాము, ఆవులదొడ్డి హనుమంతరావు, కారం శీను, జమ్మవరం బోడవాడ గ్రామ నాయకులు క్రికెట్ అభిమానులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని క్రికెట్ మ్యాచులు వీక్షించారు.

తిరుపతమ్మకు వెండి వస్తువుల జత అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి :
మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మకు హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన వాస్తవ్యులు వెండి వస్తువుల జత అందజేశారు. జక్కిరెడ్డి వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు జక్కిరెడ్డి వెంకట రామాంజనేయరెడ్డి, భార్య సుజాత దంపతులు 750 గ్రాముల విలువైన వెండి కందుల జత ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. అధికారులు శేష వస్త్రాలతో ప్రసాదాలతో వారిని సత్కరించారు.

గెలాక్సీ ఎఫ్56 విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :
అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, తమ ఎఫ్ సిరీస్ పోర్ట్‌ఫోలియోలో అత్యంత సన్నని స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎఫ్56 5జిని విడుదల చేసినట్లు షోరూం ఇన్‌ఛార్జి కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ కేవలం 7.2 ఎంఎం మందం, ఫ్లాగ్‌షిప్ గ్రేడ్ కెమెరా, ఆరు తరాల ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్ సైకిల్, ముందు, వెనుక రెండింటిలోనూ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్లస్ రక్షణ, ఉంటుందని అన్నారు. అధునాతన ఎఐ ఎడిటింగ్ సాధనాలు వంటి అనేక విభాగపు అత్యున్నత ఫీచర్లతో ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు. వివరాలకు ఎం.జి రోడ్డులోని షోరూంలో సంప్రదించొచ్చని తెలిపారు.

సైన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఎంబిఎం జడ్‌పిహెచ్ఎస్ స్కూల్ ఒకేషనల్ ట్రైనర్ బలగాని తిరుమల సైన్స్‌పై అవగాహన కల్పించారు. ముందుగా మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తిరుమల

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు వీలుల్ల మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.